

కబేళాకు తరలిస్తున్న 43 పశువులు పట్టివేత

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని కంటోన్మెంటు ప్రాంతంలో పశువులను కబేళాకు తరలిస్తున్నట్లుగా స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు వచ్చిన సమాచారంపై వన్‌టౌన్, టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడులు చేసి 43 పశువులను స్వాధీనం చేసుకున్నారు. రెండు వాహనాల్లో 43 పశువులను తరలిస్తుండగా పట్టుకున్నారు. పశువులను తరలిస్తున్న రెండు వాహనాలను, వాటి డ్రైవర్లు మిరియాల సురేష్, పత్రి శంకరరావుతోపాటు పశువులను కొనుగోలు చేసి, అక్రమంగా తరలిస్తున్న అబ్దుల్ బషీను కూడా అదుపులోకి తీసుకున్నట్లు వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు తెలిపారు. ఈ దాడుల్లో సిఐ వెంకటరావుతో పాటు టాస్క్ ఫోర్స్ సిఐ అశోక్ కుమార్, ఎస్ఐ ఎ.నరేష్, టాస్క్ ఫోర్స్ ఎస్ఐ సాగర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇసుక ఉచిత సరఫరా

- మూడు స్టాక్ పాయింట్ల నుంచి అందించే ఏర్పాట్లు
- రోజుకు ఒక్కో వ్యక్తికి 20 టన్నులు సరఫరా
- టన్నుకు రూ.605 చొప్పున ఇసుక హ్యాండ్లింగ్ ఛార్జీలు
- సరఫరాపై ఫిర్యాదులకు కంట్రోల్ రూం, టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు
- రెవెన్యూ, పోలీసు, గనులశాఖ అధికారులతో టాస్క్‌ఫోర్స్
- జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వినియోగదారులకు ఈనెల 8నుంచి ఉచితంగా ఇసుక సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వెల్లడించారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున శ్రీకాకుళం, మన్యం జిల్లాల నుంచి ఇసుకను తీసుకువచ్చి కొత్తవలస, డెంకాడ మండలం పెదతాడివాడ, బొబ్బిలి గ్రోత్‌సెంటర్ తదితర ప్రాంతాలలో వున్న మూడు స్టాక్ యార్డులలో నిల్వచేసి ఉంచినట్లు తెలిపారు. అక్కడి నుంచి జిల్లాలో ఇసుక అవసరమైన వారికి అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలోని మూడు స్టాక్ యార్డుల్లో ప్రస్తుతం 92 వేల టన్నుల ఇసుక అందుబాటులో వుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఇసుక యార్డులకు ఇతర ప్రాంతాల నుంచి ఇసుక తరలించి తీసుకు వచ్చేందుకు అయ్యే నిర్వహణ వ్యయాన్ని మాత్రమే వసూలు చేస్తూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఇసుక సరఫరా చేస్తోందని కలెక్టర్ చెప్పారు. ఇసుక సరఫరాపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అధ్యక్షతన జరిగింది. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, సెబ్ ఎస్పీ అస్మా ఫర్హీన్, డిఆర్‌ఒ అనిత, మూడు డివిజన్ల ఆర్‌డిఒలు పాల్గొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం..ఒక వ్యక్తికి రోజుకు 20టన్నుల మేరకు మాత్రమే ఇసుక సరఫరా చేస్తారు. వినియోగదారులు యార్డుల నుంచి ఇసుక తీసుకువెళ్లేందుకు రవాణా ఏర్పాట్లు తమంతట తాముగా ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. రవాణాశాఖ నిర్ణయించిన ధరల మేరకు మాత్రమే వాహనాల యజమానులు ఇసుక రవాణా ఛార్జీలను వినియోగదారుల నుంచి వసూలు చేయవలసి వుంటుంది. అంతకుమించి అధికంగా వసూలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ఇసుక యార్డులు తెరచి వుంటాయని, ఆ సమయాల్లో వినియోగదారులు ఇసుక తీసుకువెళ్లవచ్చన్నారు. శ్రీకాకుళం, మన్యం తదితర ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌ల నుంచి యార్డులకు ఇసుక తవ్వి, తరలించడం కోసం అయ్యే రవాణా, హేండ్లింగ్ ఛార్జీలను మాత్రమే టన్నుకు రూ.605 చొప్పున వినియోగదారుల నుంచి వసూలు చేస్తారు. యీ ఛార్జీలు టన్నుకు రూ.605 నిర్ణయించారు. ఇసుక సరఫరాకోసం ప్రతి స్టాక్ యార్డు వద్ద విఆర్ఒ., విఆర్ఒ, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు బాధ్యతలు అప్పగించ నున్నారు గ్రామాల్లో వున్న గెడ్డలు, వాగుల్లో లభ్యమయ్యే ఇసుకను స్థానిక అవసరాల కోసం వినియోగించవచ్చు. అయితే ఏ గ్రామంలో వున్న గెడ్డ, వాగు నుంచి ఆ గ్రామస్థులే ఎడ్ల బళ్ల ద్వారా ఇసుకను తీసుకువెళ్లేందుకు అనుమతిస్తారు. ఇతర ప్రాంతాల వారు అక్కడి ఇసుకను తీసుకువెళ్లేందుకు అనుమతించరు. జిల్లాలో ఇసుక సరఫరాపై ఆర్‌డిఒలు, తహశీల్దార్‌లు నిరంతరం నిఘా వుంచాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రోజూ ఇసుక యార్డులను తనిఖీ చేస్తూ ఇసుక సరఫరాను క్రమబద్ధీకరించాలని కలెక్టర్ చెప్పారు.

ఇసుక సరఫరా పై ఫిర్యాదులకు ఫోన్ నెంబర్

ఇసుక సరఫరాపై ఫిర్యాదులు, సలహాల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తున్నామని, ఒక టోల్ ఫ్రీ నెంబరును కూడా ఏర్పాటు చేస్తున్నామని ఎవరైనా యీ నెంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదులు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. 9032338135 మొబైల్ నెంబర్ కు ఫోన్ చేసి ఇసుక సరఫరా అంశంపై ఫిర్యాదులు లేదా సలహాలు చేయవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్‌డిఒలు ఎం.వి.సూర్యకళ, సాయిశ్రీ, బి.శాంతి, గనులశాఖ డిడి సూర్యచంద్రరావు, భూగర్భజలశాఖ డిడి దుర్గాప్రసాద్, ఉప రవాణా కమిషనర్ మణికుమార్, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సరిత, జలవనరులశాఖ ఇఇ సీతారాం నాయుడు, డిపిఒ. శ్రీధర్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయను

- అభివృద్ధికి సమిష్టిగా పనిచేస్తాం : ఎమ్‌పి కలిశెట్టి
- వ్యవస్థలను నాశనం చేయకుండా పనిచేయాలి : అశోక్ గజపతిరాజు
- జిల్లాకు చేరుకున్న ఎమ్‌పికి ఘనస్వాగతం
- అభినందించిన మంత్రులు, ఎమ్మెల్యేలు



ఎమ్‌పి కలిశెట్టిని సత్కరిస్తున్న అశోక్‌గజపతిరాజు, మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి -విజయనగరం కోట

ప్రజలు తనకిచ్చిన అవకశాన్ని, నమ్మకాన్ని వమ్ముచేయకుండా జిల్లా అభివృద్ధికి సమిష్టిగా పనిచేస్తామని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పార్లమెంట్ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత తొలిసారి జిల్లాకు విచ్చేసిన ఎంపి కలిశెట్టికి చెల్లూరు వద్ద టిడిపి,జనసేన నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడినుంచి ర్యాలీగా పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాకు ఎంపి చేరుకున్నారు. ఎంపిని ఈ సందర్భంగా కేంద్రమాజీమంత్రి అశోక్ గజపతిరాజు, మంత్రి శ్రీనివాస్ సత్కరించారు. ఆనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపి మాట్లాడారు. తన శక్తిమేరకు జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ అందరితో కలిసి సమిష్టిగా పని చేస్తామన్నారు. అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులంతా ప్రజా సమస్యల పరిష్కారం దిశగా, వ్యవస్థలను నాశనం చేయకుండా పని చేయాలని సూచించారు. దుష్ట శక్తులు అడ్డొచ్చినప్పుడు వ్యవస్థలను కాపాడుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. ప్రజా ప్రతినిధులుగా వ్యవహరించకపోతే మనమందరం ఇటీవల అనుభవించిన విషయాలే ఎదురవుతాయని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు అదితి విజయలక్ష్మి గజపతిరాజు, లోకం నాగ మాధవి మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధికి ఎంపి నిధులు కోసం ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నామన్నారు. అవినీతి రహిత పాలన అందించే విధంగా పని చేస్తామన్నారు. పార్లమెంటు అధ్యక్షులు కిమిడి నాగార్జున మాట్లాడుతూ ఈ ఐదేళ్లు ప్రజలకు సేవే లక్ష్యంగా పని చేయాలన్నారు. సమావేశంలో నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్చార్జి కర్రోతు బంగార్రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, ఎంపిటిసి రాజేష్ బాబు, వేచలపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి ఘన స్వాగతం

భోగాపురం : ఎంపిగా ప్రమాణస్వీకారం చేసి మొట్టమొదటి సారిగా జిల్లాకు విచ్చేసిన ఎంపి కలిశెట్టి అప్పలనాయుడుకు కూటమి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. రాజాపులోవ వద్దనున్న పెరం లేఔట్ వద్ద నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు గజమాల, పుష్పగుచ్చంతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో విశాఖ నార్త్ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, నెల్లిమర్ల మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు తదితర నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఉన్నతమైన సేవలే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉన్నతమైన సేవలే లక్ష్యంగా పనిచేయాలని ఘోషాస్పత్రి వైద్యులకు ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు సూచించారు. శనివారం ఆమె ఆస్పత్రిని పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి రోగులకు, బాలింతలు, గర్భిణులకు అందుతున్న సేవలు గురించి తెలుసుకున్నారు తల్లీ పిల్లలకు ఉన్నతమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించాలని సూచించారు.

డిసిసిబి అభివృద్ధికి సంపూర్ణ సహకారం : మంత్రి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) అభివృద్ధికి అన్నివిధాలా సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. బ్యాంకు సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, నాబార్డు సహకారంతో డిసిసిబి ఏర్పాటు చేసిన రెండు సంచార వాహనాలను, శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా బ్యాంకు ఆవరణలో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, గతంతో పోలిస్తే గత పదేళ్లుగా సహకార బ్యాంకు ఎంతో అభివృద్ధి సాధించిందని ప్రశంసించారు. డిపాజిట్లను పెంచాల్సి ఉందని, దానికి తమవంతు సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రోత్సహిస్తామని చెప్పారు. జిల్లాలో ప్రారంభమైన ఎఫ్‌పిఒలు ఇతర జిల్లాలకు మార్గదర్శకంగా నిలవాలని కోరారు. ప్రతీ మండలంలో డిసిసిబి బ్యాంకు శాఖను ప్రారంభించేందుకు కృషి చేయాలని మంత్రి సూచించారు.

జిల్లా సహకార అధికారి పి.రమేష్ మాట్లాడుతూ సహకార బ్యాంకుకు అనుబంధంగా జిల్లాలో 65 ప్రాథమిక సహకార సంఘాలు పనిచేస్తున్నాయని, వీటిలో 11 సంఘాలు మాత్రమే లాభాల్లో ఉన్నాయని తెలిపారు. పిఎసిఎస్‌ల బలోపేతానికి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. పెట్రోలు బంకుల నిర్వహణకు కూడా అనుమతిచ్చినట్లు చెప్పారు కార్యక్రమంలో విజయనగరం ఎంఎల్ఎ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, నాబార్డు డిడిఎం టి.నాగార్జున, డిసిసిబి సిఇఒ సిహెచ్ ఉమామహేశ్వరరావు, జనరల్ మేనేజర్ కెవిఎస్‌ఆర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



వాహనాలను ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

పేదరిక నిర్మూలనలో సహకార సంఘాల పాత్ర భేష్

పేదరిక నిర్మూలనలో సహకార సంఘాల పాత్ర శ్లాఘనీయమని జిల్లా సహకార అధికారి పి.రమేష్ కొనియాడారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా, శనివారం స్థానిక జిల్లా సహకార బ్యాంకు ఆవరణలో పతాకావిష్కరణ చేశారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న డిసిఒ రమేష్ మాట్లాడుతూ, పేదరికాన్ని నిర్మూలించే కార్యక్రమాల్లో సహకార సంఘాలు అందిస్తున్న సేవలు మరువలేనివని అన్నారు. సరైన నాయకత్వం ఉంటే సహకార సంఘాలు గణనీయమైన విజయాలను సాధిస్తాయని చెప్పారు. సహకార వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రతి సహకార సంఘం సభ్యుడు, సిబ్బంది కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాబార్డ్ జిల్లా అభివద్ధి అధికారి టి .నాగార్జున, డిసిసిబి ఇన్‌ఛార్జ్ సిఇఓ చిప్పాడ ఉమామహేశ్వర రావు, జనరల్ మేనేజర్ కెవివి సత్యనారాయణ, డిప్యూటీ రిజిస్ట్రార్ రమణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలన్నింటిలోనూ ముందుండాలి

జిల్లా ఆర్థికాభివృద్ధికి బ్యాంకులు సహకరించాలి
కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న వివిధ పథకాల కింద నిర్దేశిత లక్ష్యాల మేరకు రుణసహాయం అందించడం ద్వారా జిల్లా అభివృద్ధికి బ్యాంకులు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోరారు. పథకాల అమలులో రాష్ట్రంలో మన జిల్లాయే ముందు నిలిచేలా రానున్న రోజుల్లో బ్యాంకుల అధికారులు, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకులు, అధికారులతో కూడిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ తొలి త్రైవార్షిక సమావేశం కలెక్టర్ అంబేద్కర్ అధ్యక్షతన శనివారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని ప్రభుత్వ పథకాల అమలులో యూనిట్ల ఏర్పాటు చాలా తక్కువగా వుందని, వచ్చే సమావేశం నాటికి ఆయా బ్యాంకు బ్రాంచిలు నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. నగరంలో టిడ్కో ఇళ్లకు సంబంధించి లబ్దిదారుల పేరుతో ఇళ్లను రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్, మెప్మా పీడీలను ఆదేశించారు. తగిన సంఖ్యలో ఎస్.సి.లబ్దిదారులు దరఖాస్తు చేస్తున్నావారికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావడం లేదని డిక్కీ ప్రతినిధి నారాయణరావు అన్నారు. యూనిట్ల ఏర్పాటుకోసం ముందుకు వచ్చే ఎస్.సి. ఔత్సాహికులకు తమ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన, శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని పరిశ్రమల అధికారి గణపతి పేర్కొన్నారు.కౌలు రైతుల రుణాల మంజూరులో గత ఏడాది లక్ష్యాల మేరకు రుణాలు అందించని విషయాన్ని జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.డి.అనిత ప్రశ్నించారు. దీనిపై జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు మాట్లాడుతూ గత ఏడాది కౌలు రైతులకు సంబంధించి రుణాలపై మార్గదర్శకాలు రూపొందించడంలో ఆలస్యం కావడం వల్ల తగినంత మందికి రుణాలు అందించలేకపోయామని, ఈ ఏడాది ఇప్పటికే కౌలు రైతుల గుర్తింపుకోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కౌలు రైతుల గుర్తింపు త్వరగా పూర్తిచేసి అర్హులకు రుణాలు అందిస్తామన్నారు. జిల్లాలో పశుగణాభివృద్ధి, మత్స్య పరిశ్రమ రంగాల్లో రుణ సహాయం అధికం చేయాల్సి వుందని నాబార్డు ఎజిఎం నాగార్జున తెలిపారు. డిఆర్‌ఒ మాట్లాడుతూ మత్స్యకారులను గుర్తించి బ్యాంకులతో వారికి రుణాలు అందించేలా మత్స్యశాఖ అధికారులు సమన్వయం చేయాలన్నారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ అధికారి వైవిరమణ, డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి, మెప్మా పీడీ సుధాకర్, జిల్లా పరిషత్ సిఇఒ శ్రీధర్ రాజా, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, బిసి కార్పొరేషన్ ఇడి పెంటోజీ, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, జిల్లా ఉపాధి అధికారి అరుణ, మత్స్యశాఖ డిడి నిర్మలాకుమారి పాల్గొన్నారు. బ్యాంకుల నుంచి ఎస్‌బిఐ ఎజిఎం ఎన్.సురేష్ బాబు, యూనియన్ బ్యాంకు ఎజిఎం నరేష్, రిజర్వుబ్యాంకు ఎల్‌డిఒ ఎన్.కె.సునీల్, ఎఎల్‌డిఎం వైడి ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు

ఉద్యోగుల సహకారంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-చీపురుపల్లి

పాలనలో ఉద్యోగులందరి సహకారం ఉంటేనే రాష్ట్రం అబివృద్ధి చెందుతుందని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీరు, పారిశుధ్యం, ఉపాధి హామీ వంటి వాటిపై ప్రధానంగా సమీక్షించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా మండల అభివృద్ధికి పని చేయాలన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటైన తరువాత 97 శాతం ఫించన్లను ఒకటవ తేదీ నాటికే పంపిణీ చేయడం జరిగిందన్నారు. మిగిలిన 3శాతం లబ్ది దారులు కూడా తాత్కాలికంగా వివిధ ప్రాంతాలకు వెల్లడం వలన వారికి ఆరోజు ఇవ్వడం కుదరలేదని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంబంధిత ఆసుపత్రులలో మందులు సరిపడా ఉంచుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పనులలో చాలా అవకతవకలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మేట్లుని కూడా మార్చేందుకు ఉపాధిహామీ అధికారులు సిద్ధంగా ఉండాలని ఎంఎల్‌ఎ అన్నారు. ఖరీఫ్ సీజన్ లో రైతులు ఇబ్బందులు పడకుండా వ్యవసాధికారులు తగు సూచనలు, సలహాలు అందించాలని అధికారులకు సూచించారు. బాలింతలకు, గర్భిణులకు, పిల్లలకు పౌష్టికాహారాన్ని సకాలంలో అదేవిధంగా చూడాలని ఐసిడిఎస్ అధికారులకు సూచించారు. సమావేశంలో కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ, గవిడి నాగరాజు, రౌతు రమేష్, రౌతు నారాయణ రావు, విసినిగిరి శ్రీనివాసరావు, కోట్ల కృష్ణ, ఇప్పిలి నీలకంఠం, తహశీల్దార్ ప్రసాద్, ఎంపిడిఒ శ్వేత, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుక్కల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశ్వాసానికి మారు పేరైన శునకాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు అన్నారు. శనివారం అంతర్జాతీయ జూనోసిస్ డే సందర్భంగా జిల్లా బహుళార్ధ సాధక పశువైద్యశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పెంపకం దారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్ వేయించాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న వీధికుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలను వేస్తున్నామన్నారు. ఇంట్లో పెంచుకున్న కుక్కకు కూడా వాక్సినేషన్ తప్పనిసరిగా వేయించాలన్నారు.పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ రమణ మాట్లాడుతూ ప్రతి ఏటా కుక్కలకు జునోసిస్ డే సందర్భంగా వాక్సినేషన్ ఉచితంగా వేయిస్తున్నామన్నారు.

మృతుల కుటుంబానికి వైసిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్,మెంటాడ

మెంటాడ మండలం మీసాల పేటలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కోరాడ ఈశ్వరరావు, ఆదిలక్ష్మి కుటుంబ సభ్యులను శనివారం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ మంత్రి పీడిక రాజన్నదొర పరామర్శించారు. వారి స్థితి గతులు తెలుసుకుని వారికి అండగా ఉంటామని తెలిపారు. విద్యుత్తు శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి పాల్గొన్నారు.

ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి సంతాపం

మీసాలపేటలో విద్యుత్తు షాక్‌తో కోరాడ ఈశ్వరరావు, ఆదిలక్ష్మి అనే రైతు దంపతులు మృతి చెందడం బాధాకరమని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు పేర్కొన్నారు. వారి మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపాన్ని ప్రకటించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేయాలని, సంబంధిత అధికారుల అలసత్వం కారణమైతే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

టోల్‌గేటును వెంటనే ఎత్తివేయాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

కాంట్రాక్టర్ల స్వలాభం కోసం వేలాది మంది ప్రజలపై భారం వేసే విధంగా జొన్నాడ వద్ద నిర్మించిన అక్రమ టోల్ గేట్‌ను తక్షణం ఎత్తివెయ్యాలని ఫోరమ్ ఫర్ బెటర్ విజయనగరం కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ డిమాండ్ చేసారు ఈ సంస్థ ఆధ్వర్యాన శనివారం ఉల్లివీధిలో గల ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ జొన్నాడ వద్ద ఎటువంటి కొత్త రోడ్లు నిర్మాణాలు లేకుండా, కేవలం ఉన్న రోడ్ ను కొంత మేర వెడల్పు చేసి అక్కడ అక్రమంగా టోల్ గేట్ ఏర్పాటు చేయడం అన్యాయమని అన్నారు. చెల్లూరు నుండి నిర్మించిన కొత్త హైవే రోడ్ మీద టోల్ గేట్ ఉంటే ఎటువంటి అభ్యంతరం ఉండదు కానీ జొన్నాడ వద్ద నిర్మాణం చేయటం నిరంకుశ ధోరణి అని హోటల్ అసోసియేషోషియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ పూర్వ అధ్యక్షులు మోటమర్రి శ్రీనివాస్, రోటరీ క్లబ్ విజయనగరం కార్యదర్శి నాగ ప్రకాష్ మాట్లాడుతూ టోల్ గేట్ వల్ల ప్రజలపై కోట్లాది రూపాయల భారం పడుతుందన్నారు. ఈ సమస్యను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లాలని తీర్మానించారు. కార్యక్రమంలో గోల్డెన్ హెరిటేజ్ ఆఫ్ విజయనగరం సంస్థ సభ్యులు సూర్య లక్ష్మి, కెఆర్‌కె రాజు, మెసానిక్ క్లబ్ సభ్యులు కాపుగంటి రవి, ఆలవెల్లి శేఖర్, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఫైర్ వర్క్సు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కామేశ్వర రావు, ఛాంబర్ సభ్యులు పాల్గొన్నారు

పరిశ్రమల మంత్రి ఇలాకాలో
కార్మికుల కంట కన్నీరు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇలాకాలో కార్మికుల కంట కన్నీరు కారుతోంది. ఏళ్ల తరబడి బతుకీడుస్తున్న కార్మికుల ఉద్యోగాలు గాలికి ఎగిరిపోయినట్టుగా ఊడి పోతున్నాయి. దీంతో, వేలాది మంది కార్మిక కుటుంబాలవారు ఎలా బతకాలో అర్థం కాక పుట్టెడు దుఖ:లో మునిగిపోతున్నారు. సుమారు 50రోజుల క్రితం కొత్తలవలస మండలం కంటకాపల్లిలో పరిశ్రమను లాకౌట్ విధించిన జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ యాజమాన్యం కార్మికుల ఆకలిబాధలను లెక్కచేయడం లేదు. తాజాగా నెల్లిమర్ల జ్యూట్ మిల్లు కూడా అక్రమ లాకౌట్ విధించారు. అంతకు ముందు చాలా పరిశ్రమలు మూతపడిన సంగతి తెలిసిందే. దీంతో, కార్మికుల జీవనం దినదిన గండంగా మారింది. అసలే విజయనగరం జిల్లా పారిశ్రామికంగా అత్యంత వెనుకబడిన ప్రాంతం. ప్రభుత్వ విధానాలు, స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా కొత్త పరిశ్రమలు, ఉద్యోగాలు, ఉపాధి మాట అటుంచితే... ఉన్న ఉద్యోగాలు, ఉపాధి కూడా లేకుండా పోతున్నాయి.

ఒకప్పుడు ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమలకు పుట్టినిల్లుగావున్న విజయనగరం జిల్లా నేడు తిరోగమిస్తోంది. జిల్లాలో గరివిడి, గుర్ల, మెరకముడిదాం, బొబ్బిలి, కొత్తవలస ప్రాంతాల్లో 21 వరకు ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఉండేవి. గత ఏడాది ఏప్రిల్ నుంచి విద్యుత్ ఛార్జీలు పెంచడంతో భారాన్ని తట్టుకోలేక బొబ్బిలిలో ఉన్న యోన, ఇంపెక్స్ గరివిడిలో ఉన్న ఆంధ్రా ఫెర్రో సహా మొత్తం 10 పరిశ్రమలు మూతపడ్డాయి. గరివిడి ఫేకర్‌లో ఉత్పత్తి తగ్గించడం వల్ల ఒకే ఒక్క ఫర్నేచర్ నడుస్తోంది. బొబ్బిలిలోని సిరి ఫెర్రో ఒడిదుడుకుల మధ్య నడుస్తోంది. ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణం. ఫెర్రో క్రోమ్ ఉత్పత్తిలో విద్యుత్తు వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఛార్జీలు పెంచితే



అనివార్యంగా వాటి మనుగడ భారమౌతుంది.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ముఖ్యంగా విజయనగరం జిల్లాలోనూ ఒకప్పుడు జ్యూట్ మిల్లులు ఎక్కువగా ఉండేవి. జనపనార, గోగు (మెస్తా) కలిపి జ్యూట్ ఉత్పత్తులు తయారవుతాయి. ఉత్తరాంధ్ర నేలలు గోగు సాగుకు అనుకూలంగా ఉండడంతో ఈ ప్రాంతంలో ఎక్కువగా జ్యూట్‌మిల్లులు ఆవిర్భవించాయి. ప్రభుత్వ విధానాల కారణంగా 1990 తరువాత కాలంలో జ్యూట్ ఉత్పత్తుల స్థానంలో ప్లాస్టిక్, మైకా వంటి ప్రత్యామ్నాయ ఉత్పత్తులు అందుబాటులోకి రావడం, నార కొనుగోలుకు ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడం వంటి కారణాల వల్ల గోగు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోయింది. ఈ ప్రభావం జ్యూట్ ఉత్పత్తులపైనా పడింది. దీంతో, ఒకప్పుడున్న తొమ్మిది జ్యూట్ మిల్లులకుగాను ఒకటే నడుస్తోంది. నెల్లిమర్ల జ్యూట్‌మిల్లులో 8ఏళ్ల క్రితం 5వేల మంది నుంచి 6వేల మంది కార్మికులతో కళకళలాడేది. ప్రస్తుతం పర్మినెంట్, తాత్కాలిక కార్మికులు మొత్తంగా 2వేలు మంది మాత్రమే పనిచేస్తున్నారు. సాలూరు జీగిరాం జ్యూట్ మిల్లు ఎప్పటికప్పుడు లాకౌట్‌కు గురవుతోంది. మిగిలినవన్నీ దాదాపు ఉనికి కోల్పోయాయి. ముఖ్యంగా విజయనగరంలోని అరుణా, ఈస్టుకోస్టు, బొబ్బిలిలోని శ్రీలక్ష్మి శ్రీనివాస శాశ్వతంగా మూతపడ్డాయి. జిల్లాలో భీమసింగి, లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీలు ఉండడంతో ఒకప్పుడు జిల్లా వ్యాప్తంగా 10,473 హెక్టార్లు మేర చెరకు విస్తీర్ణం ఉండేది. వాటిని ఆధునీకరించక పోవడంతో ప్రస్తుతం 3830 హెక్టార్లకు తగ్గింది. ఆర్థిక సంక్షోభం పేరుతో లచ్చయ్యపేట సుగర్స్, చెరకు విస్తీర్ణం తగ్గిపోయిందనే పేరుతో భీమసింగి ఫ్యాక్టరీ మూసివేయడంతో వేలాది మంది రైతులు, ఇటు కార్మికులు ఉపాధి కోల్పోయారు. జిందాల్ పరిశ్రమ మూతతో 450మంది కార్మిక కుటుంబాలు, నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు మూతతో 2వేల కార్మిక కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయి. ఇలా పరిశ్రమల మూతతో వేలాది మంది ఉపాధి కోల్పోవడంతో ఆయా కుటుంబాల ఆర్థిక స్థితిగతులు దెబ్బతింటున్నాయి. వారి జీవనం దిన దినగండంగా మారుతోంది. ఎన్నికల నేపథ్యంలో పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగాలు కల్పన పేరిట తెగేసి హామీలు గుప్పించిన నాయకులు ఏ మేరకు పరిశ్రమలను తెరిపించేందుకు, కొత్త పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తారో వేచి చూడాలి.

రహదారులపై వ్యాపారాలతో అసౌకర్యం కలిగించొద్దు

ప్రజాశక్తి. -విజయనగరం టౌన్

రహదారులను ఆక్రమించి ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దని చిరు వ్యాపారులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు సూచించారు. ప్రధాన రహదారులపై చిరు వ్యాపారులు ప్రజలను, వాహనదారులకు ఇబ్బందులు కలిగించే విధంగా చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం ఉదయం ప్రధాన రహదారులలో సిబ్బందితో పరిశీలించారు. రహదారులపై వ్యాపార సామాగ్రిని ఉంచొద్దని మందలించారు. ఇకనుండి రోడ్లపై వ్యాపారాలు సాగించినట్లయితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం అన్నా క్యాంటీన్ ప్రాంతాన్ని పరిశీలించారు. క్యాంటీన్ ముందు చిరు వ్యాపారులు పూర్తిగా ఆక్రమించడానికి చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. కోడి రామమూర్తి పార్కు, గాంధీ పార్కు ప్రాంతాలను పరిశీలించారు. అక్కడ కూడా అదే పరిస్థితి ఉండడంతో వ్యాపారులను మందలించి రోడ్లపై ఉన్న సామాగ్రిని తొలగించారు.కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకష్ణ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

షాపుల యజమానులకు నోటీసులు

విజయనగరం టౌన్ : నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న షాపుల లీజుదారుల దీర్ఘకాల బకాయిలను తక్షణమే చెల్లించాలని కమిషనర్ ఎంఎం నాయుడు తెలిపారు. నగరంలో ఉన్న షాపుల దీర్ఘకాల బకాయిదారులకు శనివారం నోటీసులు అందించారు. 7 రోజుల్లో గా బకాయి పడ్డ మొత్తం డబ్బులు చెల్లించాలని, లేకుంటే షాపులు బహిరంగ వేలం వేసి వేరొకరికి కేటాయిస్తామని తెలిపారు. బకాయి పడ్డ మొత్తం డబ్బులను రాబట్టేందుకు చట్టపరంగా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

పారదర్శకంగా కౌలురైతులను గుర్తించాలి

రేగిడి: గ్రామాల్లో కౌలు రైతుల జాబితాను పారదర్శకంగా గుర్తించాలని రాజాం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు చంద్రశేఖర్ సూచించారు. శనివారం చిన్నశిర్లాం, బూరాడ, లింగాల వలస, తోకలవలస గ్రామాల్లో రైతు సేవ కేంద్రాల పరిధిలో కౌలు రైతుల గుర్తింపు కార్డుల ఎంపిక గ్రామసభలు నిర్వహించారు. ఈనెల 10 నాటికి కౌలు రైతులకు గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసి జాబితాలు తయారు చేయాలన్నారు. ఏవో గిరడ మురళీకృష్ణ మాట్లాడుతూ మండలంలోని శనివారం వరకు 82 కౌలు రైతులను గుర్తింపు కార్డులకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. గ్రామ సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

బొబ్బిలి: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని డిఎస్‌పి పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వాసు జూనియర్ కళాశాలలో శనివారం మత్తు పదార్థాలు వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలతో జీవితాలు నాశనమవుతాయన్నారు. నూతన చట్టాలపై పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

బొబ్బిలి: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. కోటలో శనివారం బేబినాయనను జిల్లా డిపిఎం ఆనందరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కలిసి నియోజకవర్గంలో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయంపై బేబినాయనకు వివరించారు. ఈ వ్యవసాయంతో అధిక లాభాలు ఉన్నాయని, ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించాలని బేబినాయన కోరారు.

విగ్రహ ప్రతిష్ఠకు రావాలని మంత్రికి ఆహ్వానం

బాడంగి: ఎపి ఎరుకల సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17న ఎరుకల కుల ఆరాధ్యుడు ఏకలవ్య జయంతి సందర్భంగా కొత్తవలస మండలం చింతల దిమ్మ గ్రామంలో ఏర్పాటు చేసిన ఏకలవ్య విగ్రహం ప్రతిష్ఠకు రావాలని రాష్ట్ర మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్‌కు ఆహ్వానం పలికామని ఎరుకుల పాకల ఎంపిటిసి, ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పాలవలస గౌరు తెలిపారు. వారిద్దరితో పాటు ఎస్‌కోట ఎమ్మెల్యే లలితకుమారి, బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన కూడా హాజరవుతారని చెప్పారు. ఎపి ఎరుకల సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలపర్తి శ్రీనివాసరావు, తదితరులు హాజరవుతారని తెలిపారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

కొత్తవలస: కొత్తవలస మండలం, కొత్తవలస రెవెన్యూ పరిధిలో గల ఆక్రమణ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. గ్రామ రెవెన్యూ అధికారి వి. రామాంజనేయులు ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు శనివారం అక్రమ నిర్మాణాలపై తొలగింపు చర్యలు చేపట్టారు. తహశీల్దార్ ఆదేశాల ప్రకారం శనివారం కొత్తవలస రెవెన్యూ గ్రామంలో సర్వే నంబర్ 168లో ప్రభుత్వ భూమిని అప్పన్నదొరపాలెం గ్రామస్తులు జోడు రామమ్మ నిర్మించిన నిర్మాణాన్ని తొలగించినట్లు ఆర్ఐ రాజేష్ తెలిపారు. రెల్లి రెవెన్యూలో సర్వే నెంబర్ 26–5లో గల ఆక్రమణలను కూడా తొలగించామని ఆయన చెప్పారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నుంచి రక్షణ

పూసపాటిరేగ: విత్తన శుద్ధి వల్ల పంటలకు తెగుళ్ల నుంచి రక్షణ కలుగుతుందని వెలగం ఏపిఎం శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని ఎరుకొండ గ్రామంలో కందివలస యూనిట్ ఇన్‌చార్జి కొప్పాక లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన విత్తన శుద్ధి కార్యక్రమంలో ఏపిఎం పాల్గొన్నారు. అనంతరం బీజామృతంతో విత్తన శుద్ధి నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ ఆల్బర్ట్స్, కందివలస యూనిట్ సిబ్బంది, విఒ గౌరి, సభ్యులు, పాల్గొన్నారు.

ఎంపి భరత్ దృష్టికి సమస్యలు

వేపాడ: మండలంలోని ఎపి ఆదర్శ పాఠశాల, కెజిబివి వసతిగృహం, బిఆర్ అంబేద్కర్ బాలికల వసతిగృహం సమస్యలతో పాటు మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలని సామాజిక కార్యకర్త రెడ్డి అప్పారావు ఎంపి శ్రీభరత్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎంపి మాట్లాడుతూ మీరిచ్చిన దరఖాస్తుల్లో సమస్యలన్నీ పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు అప్పారావు తెలిపారు.

పురుగు మందుల శ్యాంపిల్స్ సేకరణ

రామభద్రపురం: మండల కేంద్రంలో శ్రీవాసవి ఫెర్టిలైజర్స్ షాపులో శనివారం స్థానిక వ్యవసాయ అధికారులు వివిధ పురుగు మందులు, విత్తనాల నమూనాల శాంపిల్స్ సేకరించి ప్రయోగశాలకు పంపించినట్లు తెలిపారు. ఇక్కడ జరిగిన తనిఖీల్లో స్టాక్ రిజిష్టర్, అమ్మకం రసీదులు లేకుండా అక్రమ అమ్మకాలు జరుగతున్నట్లు గుర్తించారు. కొన్ని రకాల విత్తనాలు, పురుగు మందులు నాసిరకంగా ఉన్నట్లు, కాలం చెల్లిన సరుకులు విక్రయాల్లో ఉన్నట్లు కనుగొన్నారు. సుమారు రూ.1.84 లక్షల విలువైన 44,500 కేజీల విత్తనాలు, రూ.7.14 లక్షల విలువ చేసే 914 లీటర్ల పురుగు మందులు నాసిరకంగా ఉన్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేశారు. వీటి నాణ్యతా, ప్రమాణాలు ల్యాబ్ టెస్టుల ద్వారా నిర్ధారించి నిర్వాహకులపై తగు చర్యలకు సిఫారుసు చేస్తామని ఎఒ వెంకటయ్య తెలిపారు.

ఆధునిక పద్ధతుల్లో బోధన

రామభద్రపురం: విద్యార్థులకు ఆధునిక బోధనా పద్ధతుల ద్వారా బోధన జరిగేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఉప విద్యా శాఖాధికారి నాగేశ్వరరావు ఆదేశించారు. శనివారం పాత రేగ జెడ్పీ స్కూల్‌ను ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, హాజరు శాతం పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మెను మేరకు అమలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. వంటకాలు రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదుల్లో విద్యార్థులకు పలు పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వల్లంపూడిలో జగ్జీవన్‌రాం వర్ధంతి


వేపాడ: వల్లంపూడి గ్రామంలో బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి దళిత నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. దళిత నాయకులు మాట్లాడుతూ 40 సంవత్సరాల రాజకీయ చరిత్ర కలిగిన ఏకైక దళిత నాయకుడు బాబు జగజ్జివన్‌రావు అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల దళిత మహాసభ అధ్యక్షుడు కె రాము, సీనియర్ నాయకుడు కె.ఏసుదాసు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

వేపాడ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంఇఒలు జగదీశ్వరరావు, బాలభాస్కరరావు కోరారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శనివారం జియో సంస్థ ఆధ్వర్యంలో పండ్ల, నీడినిచ్చే మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జియో సంస్థ ఆర్గనైజర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. అన్నయ్య, గ్రీన్ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ జెడ్‌పిటిసి 'బొంతు' మృతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ



పూసపాటిరేగ మాజీ జెడ్‌పిటిసి బొంతు అప్పలనాయుడు (85) అనారోగ్యంతో శనివారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య అక్కమ్మతో పాటు ముగ్గురు కుమారులు రవి, సతీష్, జనార్ధన్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన పేరాపురం సర్పంచ్‌గా మూడుసార్లు, ఎంపిటిసిగా ఒకసారి పూసపాటి రేగ జెడ్‌పిటిసిగా ఒకసారి ప్రజలకు సేవలందించారు. మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు రాజకీయ జీవితంలో ఈయన కీలక భూమిక పోషించారు. మండల రాజకీయల్లో పార్టీలకతీతంగా ఆయనకు ప్రత్యేక గౌరవం ఉంది. ఈయన భార్య అక్కమ్మ, పెద్ద కుమారుడు బొంతు రవి, కోడలు బొంతు ఉమా పేరాపురం సర్పంచులుగా సేవలందించారు. ఆదివారం ఉదయం ఆయన స్వగ్రామం పేరాపురంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ప్రజాశక్తి- బాడంగి

గ్రామాలాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. శనివారం స్థానిక మండలం పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నియోజవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. పార్టీలకతీతంగా అందరూ కలిసి ముందుకు రావాలని కోరారు. ఏదో మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం కాకుండా ఈసారి ప్రతి గ్రామం నుంచి సర్పంచ్, ఎంపిటిసిలు 15 నిమిషాల నుంచి 30 నిమిషాల వరకు మాట్లాడే విధంగా ప్రణాళిక తయారు చేసుకొని రావాలని సూచించారు. గ్రామీణాభివృద్ధికి తమ ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. గత పాలకులు నిర్వహణ లోపంతో పారది బ్రిడ్జ్ వల్ల నియోజకవర్గంలో 80శాతం రోడ్లు పాడైపోయాయన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి గౌరీ, జెడ్‌పిటిసి రామారావు, వైస్ ఎంపిపిలు భాస్కర్ రావు, రమేష్, ఎంపిడిఒ ఆంజనేయులు, మండల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మండల సమావేశంలో ఎమ్మెల్యే బేబినాయన



బాడంగి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

సంతకవిటి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సిరిపురపు మంజు అధ్యక్షతన శనివారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో వివిధ ప్రభుత్వశాఖల పనితీరుపై సమీక్షించారు. తాగునీరు, గ్రామీణ గృహ నిర్మాణం, ప్రాథమిక విద్య, ఉపాధిహామి, వ్యవసాయం, ఆరోగ్యం, పారిశుధ్యం, డ్వాక్రా, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిషు శంక్షేమ శాఖ, నీటిపారుదల శాఖ వంటి వాటిపై సమీక్షింఆరు. ఈ సమావేశంలో తహశీల్దార్ తిరుమలరావు, ఎంపిడిఒ పైడితల్లి, ఎంఇఒ శాంతకుమారి, ఎఇ నవీన్, ఎలక్ట్రికల్ ఎఇ శాహెబ్, హౌసింగ్ ఎఇ కనకరాజు, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ: ప్రజా ప్రతినిధులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి పీరుబండి హైమావతి అన్నారు. గురువారం మండల కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్నది వర్షాకాలం కావున ప్రతి గ్రామంలోని పారిశుధ్య పనులు చేపట్టి ఈగలు, దోమల నుంచి ప్రజలను రక్షించాలన్నారు. కాలువలోని మురికి నీరు నిల్వ లేకుండా చేయాలన్నారు. రోడ్లను పరిశుభ్రంగా చేయించాలన్నారు. వైద్యాధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలలో సందర్శించి సరైన వైద్యం అందించాలన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు శాఖలపై చర్చించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎంపిడిఒ భవాని, ఎస్‌సి సెల్ అధ్యక్షులు పీరుబండి జైహిందకుమార్, ఇఒపిఆర్‌డి ఉమా, పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించండి

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం పంచాయతీ పరిధిలోని చెరువుగట్టుపై, సాగునీటి కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని పలువురు గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. భోగాపురంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పెట్రోల్ బంకుతో పాటు మరో కంపెనీ యాజమాన్యం సాగునీరు కాలువలను ఆక్రమించి చిన్న పైపులైన్లు వేసి వదిలేసారని అన్నారు. వీరికి ఎలా అనుమతులు ఇచ్చారని కొమ్మూరు శ్రీనివాసరావు ప్రశ్నించారు. గత సమావేశంలోనూ దీనిపై చర్చించినప్పటికీ ఇంతవరకు పట్టించుకోలేదని అన్నారు. చెరువుగట్టు ఆక్రమణలపై కూడా ఎందుకు పట్టించుకోలేదని ఆళ్ల వాసు ప్రశ్నించారు. బట్టీ కాలువ లో పూడికలు తొలగించాలని కోరారు. పంచాయతీ కార్యాలయం వెనుక పక్కనున్న కార్యాలయం వెనుక ఉన్న చెరువుగట్టు చుట్టూ మొక్కలు పెంచి వాకింగ్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ విస్తరణ అధికారి సురేష్, ఇన్చార్జి ఈవో సురేష్, నాయకులు కె.సుభోసనరావు, ఉదయబాబు, పడాల శ్రీనివాసరావు, ఎస్ హరీస్, పల్లంట్ల జగదీష్, పళ్ల రాంబాబు, పడాల భాను, బొల్లు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే కార్పొరేట్ దోపిడీకి అడ్డుకట్ట

ప్రజాశక్తి- బొబ్బిలి

పోరాటాలతోనే కార్పొరేట్ దోపిడికు అడ్డుకట్ట వేయగలమని విరసం అధ్యక్షులు పాణి, ప్రగతిశీల కార్మిక సంఘం అధ్యక్షులు కొండారెడ్డి అన్నారు. స్థానిక గంటి ప్రసాదం భవనంలో శనివారం టి.అప్పలనాయుడు అధ్యక్షతన గంటి ప్రసాదం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ దోపిడీ పెరిగిపోయిందన్నారు. ప్రజలను విచ్చిన్నం చేసేందుకు కుల, మత ఘర్షణలను రెచ్చగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఏపార్టీ అధికారంలోకి వచ్చినా ప్రజలు, రైతులు, కార్మికులు, కష్టజీవులకు అన్యాయం చేసి కార్పొరేట్ సంస్థలకు లబ్ది చేకూరుస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి జైల్లో పెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలను గంటి ప్రసాదం ప్రశ్నించడం వల్లనే హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సంపాదన కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని, పోరాటాలతో కార్పొరేట్ దోపిడీను అడ్డుకోవాలని



మాట్లాడుతున్న విరసం అధ్యక్షుడు పాణి, తదితరులు

పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు పిల్ల లక్షణరావు, సిఐటియు నాయకులు పి శంకర్రావు, ప్రగతిశీల కార్మిక సమైక్య జిల్లా కార్యదర్శి రాయితీ సత్యం, గంటి రమణ, గంటి స్మారక కమిటీ సభ్యులు దాసరి వెంకటరమణ, నల్లి తవిటి నాయుడు, ఆర్ కుమార్ నాయుడు, గంటి ప్రసాదం తనయుడు గంటి సుధీర్, ప్రజా కళా మండలి రాష్ట్ర నాయకులు తూముల సింహాచలం, బొడ్డేపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలకనుగుణంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్య కార్యదర్శి సునీల్‌రాజ్‌కుమార్

విద్యార్థులను అంబేద్కర్ ఆశయాలకనుగుణంగా తీర్చిదిద్దా లని సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాలల ముఖ్య కార్యదర్శి కె. సునీల్ రాజుకుమార్ అన్నారు. శనివారం ఆయన స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విజయనగరం, మన్యం జిల్లాలలో పనిచే స్తున్న ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, హెల్త్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా వుండేట ట్లు విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. ప్రతి విద్యార్థి 100 శాతం విద్యాప్రమాణాలు కలిగి వుండేటట్లు శిక్షణ ఇవ్వాలని, సమాజంలో మంచి విద్యార్థులుగా తీర్చిదిద బడే విధంగా సిబ్బంది తమవంతు కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యవంతంగా వుండే టట్లు వారికి ఎప్పటికప్పుడు ఆరోగ్య తనిఖీలు చేయించి వారిని ఆరోగ్యవంతులుగా వుండేటట్లు చూడాలని ఇది ప్రతి ఒక్కరి భాధ్యతని తెలిపారు. కాగా ప్రతి విద్యార్థి పాఠశాల విడిచి వెళ్ళేట ప్పుడు పరిపూర్ణమైన నైపుణ్యా లతో, కంప్యూటర్ స్కిల్స్ ప్రతిభవుండేటట్లు తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సమన్వయ కర్త టి.పద్మజ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఉషారాణి, విజయనగరం, మన్యం జిల్లాల ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ పాల్గొన్నారు.

సకాలంలో టీకాలు వేయించాలి

ప్రజాశక్తి- గంట్యాడ

రాబిస్ వ్యాధి సంభవించకుండా పశువులకు సకాలంలో టీకాలను వేయించుకోవాలని గంట్యాడ పశువైద్యాధికారి రెడ్డి కృష్ణ అన్నారు. గురువారం గంట్యాడలోని పశు వైద్య కేంద్రం వద్ద జూనోసిస్‌డే సందర్భంగా రాబిస్ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 43 పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్నామన్నారు. కుక్కలను పెంచిన ప్రతి ఒక్కరూ సకాలంలో టీకాలు వేయించుకోవాలన్నారు. జంతువుల నుంచి మనుషులకు వ్యాపించిన వ్యాధులు గురించి అవగాహన కల్పించారు.

గరివిడి : ప్రపంచ జంతు సాంక్రమిక వ్యాధుల దినోత్సవం సందర్భంగా స్థానిక పశువైద్య కళాశాలలో అసోసియేట్ డీన్ ఆచార్య డాక్టర్ మక్కెన శ్రీను అధ్యక్షతన శనివారం సభ నిర్వహించారు. చీపురపల్లి సిఐ సి.హెచ్ షణ్ముఖరావు హాజరై మాట్లాడారు. పెంపుడు కుక్కల, ఇతర పశువులతో కలిసి చాలా మంది జీవిస్తున్న నేపథ్యంలో వాటికి తప్పనిసరిగా టీకాలు వేయాలన్నారు. కళాశాల అసోసియేషన్ డాక్టర్ మక్కెన శ్రీను మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వాటిని జూనోటిక్ వ్యాధులని అంటారని చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య చికిత్స సముదాయం అధిపతి డాక్టర్ ఎన్‌వివి హరికృష్ణ, డాక్టర్ సుప్రియ, డాక్టర్ శ్రీ కళ, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ ప్రకాష్ కుమార్, డాక్టర్ హరిత, డాక్టర్ ఫణీంద్ర, డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ నారాయణరావు, విద్యార్థులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని అక్కివరం పశువుల ఆసుపత్రి వద్ద ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉచిత రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కారయక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు, సర్పంచ్ కంది కిరణ్, డాక్టర్ శ్రీకాంత్, పాల్గొన్నారు.

మెరకముడిదాం: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పశువైద్యశాలలో 40 పెంపుడు కుక్కలకు ఏంటి రేబిస్ టీకాలు వేశారు. పశు వైద్యాధి కారి డాక్టర్ సిహెచ్ హైమావతి మాట్లాడుతూ రేబిస్ ప్రాణంతకమైందని పెంపుడు కుక్కల యజమానులు ఈ వ్యాధి గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో విఎల్ఒ ఏ. విజయలక్ష్మి, ఎల్ఎస్ ఏ.జి.శంకరరావు, వెటర్నరీ అసిస్టెంట్ పి. శంకరరావు, పి.సురేష్, ఆదినారాయణ పాల్గొన్నారు.

కార్మికోద్యమ నాయకులు 'ఉరిటి' మృతి

నెల్లిమర్ల: జ్యూట్ కార్మికోద్యమ నాయకులు ఉరిటి ఉమామహేశ్వరరావు (74) గుండెపోటుతో మృతి చెందారు. గాంధీ నగర్ కాలనీ తన స్వగృహంలో శుక్రవారం రాత్రి ఆయన కన్నుమూశారు. ఉమా మహేశ్వరరావు నెల్లిమర్ల జ్యూట్ మిల్లు కార్మికోద్యమంలో కీలక పాత్ర పోషించి ఇక్కడ ఇఫ్టూ సంఘం ఏర్పాటుకు కృషి చేశారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి పట్ల సిపిఎం నాయకులు రెడ్డి శంకరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం. శ్రీనివాసా, జి.అప్పలసూరి, సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి కె.దివాకర్, ఎఐటియుసి నాయకులు మొయిద పాపారావు నివాళులర్పించి సంతాపం తెలిపారు.

లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలి

గరివిడి: విద్యార్థులు లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలని ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ కోరారు. పట్టణంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం ఆవరణలో ఆశయ యూత్ అసోసియేషన్, ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో సంచార గ్రంథాలయ పర్యటనలో భాగంగా శనివారం విద్యార్థుల చెంతకే పుస్తకాల ప్రదర్శన, పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిల్లలతో పలు పుస్తకాలు చదివించారు. రెడ్డి రమణ మాట్లాడుతూ జీవితాన్ని మార్చగలిగే శక్తి పుస్తకాలకు మాత్రమే వుందన్నారు. ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతోనే నిండు ప్రాణాలు బలి

ప్రజాశక్తి- రేగిడి/రాజాం

వాహనాలలో ప్రయాణం చేసేటప్పుడు నిర్లక్ష్యంగా నడపడం వల్లే నిండు ప్రాణాలు బలవుతున్నాయని రాజాం మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జ్ సిహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. శనివారం రాజాం మండల కేంద్రం కోర్టు ఆవరణలో వాహనదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు. వాహనాలు నడిపేటప్పుడు సెల్ ఫోన్లతో మాట్లాడవద్దని, అలా మాట్లాడితే ప్రమాదాలు జరిగి నిండు ప్రాణాలు బలి కావచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. జూనియర్ సివిల్ జడ్జ్ పిఎస్‌విబి కృష్ణ సాయి తేజ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు రహదారి పొడవునా అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలను ఓవర్ టేక్ చేసేటప్పుడు ముందు జాగ్రత్తలు తీసుకో



మాట్లాడుతున్న జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

వాలన్నారు. ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదాలు జరిగేటప్పుడు హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చునని అన్నారు. ఈ అవగాహన సదస్సులో రాజాం రూరల్ సిఐ ఎస్ శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామినాయుడు, జనరల్ సెక్రెటరీ ఈశ్వరరావు, శ్రీనివాసరావు, ప్రభుత్వ న్యాయవాది పోలారావు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - జామి

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చేతుల మీదుగా స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమం శనివారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో కుమారాం ప్రభుత్వ పాఠశాలలో చేపట్టారు. ఎమ్‌ఇఒలు జయశ్రీ, గంగారాజులు, హెచ్‌ఎం జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సదుపాయలను ప్రతి పేద విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బండారు పెదబాబు, స్వామినాయుడు, వర్రి రమణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ

శృంగవరపుకోట: పట్టణంలోని కొట్టాన వీధిలో గల అంగన్వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అంగన్వాడీలో గల సదుపాయాలను, చిన్నారులకు పెట్టే మెనూ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

డెంకాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోపాడలో స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు చేతులు మీదుగా చేపట్టారు. మోపాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, కెజిబివి, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆయన చేతులు మీదుగా అందించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ బడ్డుకొండ కవిత, ఉప సర్పంచ్ బి. సత్యంనాయుడు, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ టి.సుజాత, గ్రామ నాయకులు బి.మురళి, బి.విజయ్ కుమార్, గ్రామ యువ నాయకులు పి.ఉపేంద్ర, కె.రాకేష్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్ నాగకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల అమ్మకాలపై దర్యాప్తు

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక సురేష్ స్కూల్ యాజమాన్యం పుస్తకాలు అమ్మకాలపై జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్ దర్యాప్తు చేశారు. విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకంగా ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాల యాజమాన్యాలు పుస్తకాలు అమ్మి విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయి. పుస్తకాల దోపిడీకి వ్యతిరేకంగా ఎస్.ఎఫ్.ఐ పోరాటం చేయడంతో జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించి సురేష్ స్కూల్లో శనివారం దర్యాప్తు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పుస్తకాల అమ్మకాలపై డిప్యూటీ డిఇఒకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని, కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్.ఎఫ్.ఐ నాయకులు మణికుమార్ కోరగా మందలిస్తామని హామీ ఇచ్చారు. ఎస్.ఎఫ్.ఐ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. అధిక ధరలకు పుస్తకాలు అమ్మితే పాఠశాల గుర్తింపు రద్దు చేస్తామని డిఇఒ హెచ్చరించారు.

మధ్యాహ్నం భోజనాల్లో నాణ్యత పాటించాలి

మధ్యాహ్నం భోజనాల్లో నాణ్యత పాటించాలని డిఇఒ ప్రేమకుమార్ కోరారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికొన్నత పాఠశాల, గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాలలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాలు నాణ్యతను పరిశీలించారు. భోజనాల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయనతో ఎంఇఒలు లక్ష్మణరావు, వాసు ఉన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- బాడంగి

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బేబీ నాయన అన్నారు. శనివారం స్థానిక సామాజిక ఆసుపత్రిలో జనరల్ సమావేశంలో పోల్గొన్న తరువాత మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడుతో కలిసి కొత్తగా నిర్మిస్తున్న ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు పూర్తిగా ఆసుపత్రిని గాలికే వదిలేసారన్నారు. 2019లో మంజూరై, 50 పడకల ఆసుపత్రి ఇప్పటికీ పూర్తి అవ్వకపోవడం బాధాకరమన్నారు.

త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. వైద్యులు, రోగులు ఎక్కువగా ఉన్నా తగినంత మౌలిక సదుపాయాలు లేవని అన్నారు. తక్షణమే ఆసుపత్రికి కావలసిన సదుపాయాలను, సామాగ్రిని ఏర్పాటు చేయాలని అన్నారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూసుకోవాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ పెద్దింటి నాగేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, బొంతు త్రినాద్, సర్పంచ్ కండి రమేష్, ఎంపిటిసి శ్రీను పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే భార్యకు పరామర్శ

మాజీ ఎమ్మెల్యే తెంటు జయప్రకాశ్ సతీమణి సత్యవతమ్మని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన శనివారం ముగడ ఆమె స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఎన్నికలలో భారీ విజయం సాధించిన ఎమ్మెల్యేని ఆమె అభినందించారు. ఆరోగ్య పరిస్థితిలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, తెంటు రవిబాబు, యామలి అప్పలనాయుడు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శన

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని బల్లంకి గ్రామంలోని నువ్వుల్లో నవధాన్యాలు, వరిలో నవధాన్యాలు సాగు చేసే ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని శనివారం విజయనగరం డిఎల్‌ఎమ్‌పి రామస్వామినాయుడు సందర్శించారు. న్యూట్రి కిచెన్ గార్డెన్‌లను చూసి వాటి యొక్క అమలను పటిష్టవంతంగా చేయాలని కిచెన్ గార్డెన్లో అన్ని రకాల కూరగాయల జాతులను వేయించి ఫ్యామిలీకి పూర్తిగా కూరగాయలు వినియోగపడే టట్టుగా చూడాలని చెప్పారు. భర్తవానిపాలెంలో మిల్లెట్స్ గంటెలు వేసే 15 ఎకరాల బ్లాక్‌ను చూసి అందులో నవధాన్యాల సాగు పద్ధతిని పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించే ప్రకృతి వ్యవసాయ చిరుధాన్యాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. అనంతరం వేపాడ మండల సమాఖ్యలో కృషి, సఖీ టిమ్, గ్రామ సంఘ సభ్యులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పై శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయంలో ఏ గ్రేడ్, ఏటీఎం మోడల్స్‌ను పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎమ్‌టిఎల్ వసంత ఎమ్‌టి సన్యాసమ్మ, ఈశ్వర్, రాము, రామలక్ష్మి, ఈశ్వరమ్మ, సుస్థిర వ్యవసాయ కేంద్రం నుంచి చిన్న వెంకట్రావు పాల్గొన్నారు.



రైతులకు ప్రకృతి వ్యవసాయంపై వివరిస్తున్న రామస్వామినాయుడు

బైక్ బోల్తా.. ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - చీపురుపల్లి

ద్విచక్ర వాహనం బోల్తా పడటంతో యర్రోపు విజయ్, మీసాల కామేశ్వరి, పొదిలాపు ఆదిలక్ష్మిలు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాడంగి మండలం ముగడ గ్రామానికి చెందిన యర్రోపు విజయ్, చీపురుపల్లికి చెందిన మీసాల కామేశ్వరి, రావివలస పంచాయతీ కొత్తపేటకు చెందిన పొదిలాపు ఆదిలక్ష్మి ద్విచక్ర వాహనంపై వత్సలవలస రాజులమ్మ యాత్రకు వెల్లారు. చీపురుపల్లి మండలం సంకుపాలేం జంక్షన్ వద్ద వ్యాన్‌ను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో పొదిలాపు ఆదిలక్ష్మి తలకు తీవ్ర గాయాలు కాగా మీసాల కామేశ్వరికి కుడికాలు విరిగిపోయింది. వాహనం నడుపుతున్న విజయ్‌కి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను 108 వాహనంపై చీపురుపల్లి ఆసుపత్రికి తరలించారు.

నేరాలు ఘోరాలు

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని దిబ్బలపాలెం గ్రామ సమీప తోటలో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మృతదేహాన్ని శనివారం సాయంత్రం చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ముఖం పూర్తిగా కుళ్ళిపోయే స్థితిలో ఉండడంతో సుమారు వారం రోజుల కిందట ఆత్మహత్య చేసుకున్నట్లుగా తెలుస్తోందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని మధుపాడ గ్రామం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వేల్పూరి చిట్టెమ్మ (68) మృతి చెందింది. కాల కృత్యాలు తీర్చుకునేందుకు రోడ్డు దాటుతున్న ఆమెను విజయనగరం నుంచి సాలూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అయినప్పటికీ పరిస్థితి విషమించి శనివారం ఆమె మృతి చెందింది.

పురుగుల మందు తాగి మహిళ..

ప్రజాశక్తి-చీపురుపల్లి

పురుగుల మందు తాగి బొమ్మరోతు పార్వతి(40) అనే మహిళ శనిరవారం మృతి చెందింది. ఎస్ఐ కె.కిరణ్ కుమార్ నాయుడు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని పేరిపి గ్రామానికి చెందిన పార్వతి ఈ నెల ఒకటో తేదీన ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేచింది. వైద్యం కోసం కుటుంబ సభ్యులు విజయనగరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలి తల్లి గొర్లె సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు